# పేదల తలరాతను మార్చిన జగన్

- గడప గడపలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్



గుమ్మఘట్ట: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



బెళుగుప్ప: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ల అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్

**గుమ్మఘట్ట:** పేదవారి జీవితాల్లో వెలుగులు నింపి, వారి తలరాతను మార్చాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కలుగోడు గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ హెచ్.కవిత అధ్యక్షతన నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి నాలుగు సంవత్సరాల కాలంలో ఎంతెంత లబ్ధి పొందారో వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. 40 ఇయర్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు గత ప్రభుత్వ హయాంలో దోపిడీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని దివాలా తీసేలా పాలన చేసి పేదల నోట్లో మట్టికొట్టారని దుయ్యబట్టారు. దింపుడు కళ్లెం లాంటి టీడీపీని నమ్మేస్థితిలో జనం లేరన్నారు. అర్హులందరికీ కూడు, గూడు, విద్య, వైద్యం, తాగునీరు, కనీస వసతులు కల్పించి సీఎం జగన్ ఆదుకుంటుంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా కోర్టులకు వెళ్లి అభివృద్ధికి అవరోధులుగా మారారని ఆరోపించారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చల్లని మనస్సుతో ఆదరించి మరోసారి ముఖ్యమంత్రి చేసుకుంటే మరెన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకోవడం ఖాయమన్నారు. రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి, ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గౌని కాంతారెడ్డి, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణ రెడ్డి, ఆర్టీ కాంతారెడ్డి, సర్పంచులు ఉమేష్, అనిల్ సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఓబుళకాంతమ్మ, గోవింద, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, నాయకులు నాగేంద్రప్ప, వీరారెడ్డి, రాజయ్య, పాలాక్షిరెడ్డి, సూరయ్య, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం**

**బెళుగుప్ప:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండల ంలోని గంగవరంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, రూ.20 లక్షల చొప్పున నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ యాదవ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో మహిళా సంఘాలు, రైతులతో కలసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విశ్వ, పైలా, హరీష్‌యాదవ్‌ను ముస్లింలు, సర్పంచ్ రోజా, ఎంపీటీసీ ప్రసాద్, స్థానిక పార్టీ నాయకులు దుశ్శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ రామచంద్ర, నాయకులు త్రిలోక్, రఘు, సునీల్, మస్తాన్‌వలి, రవి, దశరథ్, జలీల్, మల్లప్ప, ఎర్రిస్వామి, రాము, లక్ష్మీనారాయణ, చెన్నవీర, సిద్దప్ప పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జంబుకేశ్వరుడికి విశేష అలంకరణ



**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభు జంబుకేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేకువజామునే స్వామికి పంచామృతాభిషేకం, రుద్ర కవచాభిషేకాలు గావించి మూలవిరాట్‌ను తామరపూలతో అలకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

### బార్ అండ్ రెస్టారెంట్‌పై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

**ఉరవకొండ:** పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ గత వారం కలెక్టర్‌ను పాతపేట ఏరియా సచివాలయం-4 పరిధిలోని ప్రజలు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ సోమవారం తహసీల్దార్ ఈరమ్మ, ఆర్ఐ, వీఆర్‌ఓను విచారణ చేయాలని ఆదేశించారు. నాయకులు బ్యాళ్ల శివప్రసాద్, ఎరికల శేఖర్, వడ్డే మోహన్, సూర్యనారాయణతో కలసి తహసీల్దార్ ప్రజల అభిప్రాయాలను సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తహసీల్దార్ తెలిపారు.

### చదువుతోనే బాల్యవివాహాల నిర్మూలన



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీనారాయణ

**కళ్యాణదుర్గం:** బాల్య వివాహాల నిర్మూలన చదువుతోనే సాధ్యమని హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక కేజీబీవీలో సోమవారం బాలికలకు పీసీఅండ్‌పీఎన్‌డీటీ చట్టం 1994పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. లింగ నిర్ధారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భ్రూణ హత్యలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఏఎస్ఎం శైలజ, కేజీబీవీ ఎస్ఓ నాగజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### 'బాధితులకు న్యాయం చేయాలి'

**వజ్రకరూరు:** గ్యాస్ సిలిండర్ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం వజ్రకరూరులోని ఇండియన్ గ్యాస్ కార్యాలయం ఎదుట ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిపై బాధితులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కొద్ది రోజులక్రితం వెంకటాంపల్లి పెద్దతండాలో సిలిండర్ పేలడంతో ఆర్.వి.సరోజమ్మ తోపాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. సోమవారం తెల్లవారుజామున కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సరోజమ్మ మృతిచెందడంతో మృతదేహాన్ని వజ్రకరూరుకు తీసుకువచ్చారు. బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు వజ్రకరూరులోని ఇండియన్ గ్యాస్ కార్యాలయం ఎదుట ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతిచెందిన మహిళ కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు తీవ్రంగా గాయపడి పలు ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్న వారికి న్యాయం చేయాలని కోరారు. ఉరవకొండ సీఐ శేఖర్ ఘటనాస్థలికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను పిలిపించి బాధితులకు న్యాయం చేసేలా హామీ ఇప్పించారు. వజ్రకరూరు ఎస్ఐ రాజశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

### దోమల నివారణకు పిచికారీ మందు అందజేత



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

**ఉరవకొండ:** పంచాయతీకి తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ వరలక్ష్మి సమక్షంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి రూ.20 వేల విలువ చేసే దోమల మందు, సామగ్రి సోమవారం ఈఓ గౌస్‌సాహెబ్‌కు అందించారు. అనంతరం డెంగీ నివారణ మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ చంద్రమ్మ, జడ్పీటీసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో దోమల నివారణకు పాగింగ్ చేపడుతున్నామన్నారు. మురుగు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నామన్నారు.

## స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

**కూడేరు:** గత సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అధికారులు కొందరే హాజరవడంతో 'స్పందన పై అధికారుల నిర్లక్ష్యం' అనే శీర్షికతో సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనానికి మండల అధికారుల్లో చలనం వచ్చింది. సోమవారం నిర్వహించిన స్పందనకు తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగభూషణరెడ్డి, ఏపీఎం రాజశేఖర్, ఏఓ విజయకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణతో పాటు పలు శాఖల అధికారులు హాజరయ్యారు. దీంతో సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## డ్రైనేజీల నిర్మాణానికి నేడు భూమి పూజ

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని 13, 14 వార్డుల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద మంజూరైన నిధులతో సీసీ డ్రైనేజీల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హాజరై పనులను ప్రారంభిస్తారన్నారు. పట్టణంలోని 13వ వార్డు శనిశ్వరాలయం వద్ద, 14వ వార్డు ఆంజనేయస్వామి గుడి వద్ద సీసీ డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ జరుగుతుందని, కార్యక్రమానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



పట్టణంలో పోలీస్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం:** శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. రెండు రోజుల క్రితం మొహర్రం సందర్భంగా కళ్యాణదుర్గం డివిజన్‌లోని కంబదూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో అల్లర్లు జరిగిన నేపథ్యంలో సోమవారం పట్టణంలో పోలీసుల మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పండుగలు సాంప్రదాయాలకు ప్రతీకలన్నారు. ఇలాంటి వాటిని కులమతాలకు అతీతంగా జరుపుకోవాలన్నారు. కొందరు ఆకతాయుల వల్ల అల్లర్లు చెలరేగి గొడవలకు దారి తీస్తున్నాయన్నారు. అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంతకుముందు పట్టణంలో జరిగిన అల్లర్లపై అడిషనల్ ఎస్పీ హనుమంతు ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, తేజమూర్తి, ఎస్ఐలు నాగమధు, ఆశాబేగం, సుధాకర్, ఇతర మండలాల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి**

మొహర్రం సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలో దళితులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీవాసులు నిరసనకు దిగారు. సోమవారం ఉదయం ప్రభుత్వాసుపత్రిలో గాయపడిన వారిని కాలనీవాసులు, దళిత సంఘాలు పరామర్శించారు. అనంతరం అక్కడి నుండి ర్యాలీగా టీ సర్కిల్‌కు చేరుకుని బైఠాయించారు. నిందితులను అరెస్టు చేసే వరకూ ఇక్కడి నుండి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐలు తేజమూర్తి, శ్రీనివాసులు, ఎస్ఐలు నాగమధు, సుధాకర్ సిబ్బందితో కలసి టీ సర్కిల్‌కు చేరుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

## సంక్షిప్త సమాచారం

**పోలీసు స్టేషన్ తనిఖీ**

**కంబదూరు:** మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఏఎస్పీ హనుమంతు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరు, మండలంలోని శాంతి భద్రతల గురించి ఎస్ఐ రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొహర్రం సందర్భంగా మండల కేంద్రంలో జరిగిన అలజడిపై ఆరా తీశారు. అల్లర్లు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, శాంతి భద్రతలను విఘాతం కలిగించే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**బైకు అపహరణ**

**కళ్యాణదుర్గం:** పట్టణంలోని వడ్డే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురళికి చెందిన బైకు అపహరణకు గురైంది. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మొహర్రం సందర్భంగా వడ్డే కాలనీ సమీపంలోని మారెమ్మ గుడి వద్ద షెడ్డులో ఉంచిన ఏపీ 02 సీఏ 9259 గల హోండా షైన్ బైకును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని బాధితుడు వాపోయాడు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

**'బాధితులకు న్యాయం చేస్తాం'**

**వజ్రకరూరు:** వెంకటాంపల్లిపెద్దతండా(రూపానాయక్‌తాండా) గ్రామంలో ఇటీవల సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడిన బాధితులకు తప్పక న్యాయం జరిగేలా చూస్తానని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడి సోమవారం కర్నూలు ఆస్పత్రిలో మృతిచెందిన ఆర్‌వి.సరోజమ్మ కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

**అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య**

**కళ్యాణదుర్గం:** అప్పుల బాధతో పట్టణానికి చెందిన ఓ దివ్యాంగుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని బావి బసప్ప వీధికి చెందిన బాలా పురుషోత్తం(45) పుట్టుకతోనే పోలియోవ్యాధిగ్రస్తుడు. పట్టణ సమీపంలో ఎనిమిది ఎకరాల్లో వ్యవసాయం చేయిస్తూ, ఇంటి వద్ద టీ కొట్టు పెట్టుకుని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో వ్యవసాయానికి పెట్టుబడులు అధికం కావడంతో బయటి వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. ఇటీవల అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మొహర్రం పండుగకు కుటుంబీకులు రాయదుర్గం మండలం మారెంపల్లికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న పురుషోత్తం సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య శాంతి, కుమార్తెలు హారిక (వికలాంగురాలు), రుగ్విజ, కుమారుడు ప్రేమ్‌సాయి ఉన్నారు. మృతుని భార్య శాంతి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ఆటో బోల్తా ..ఒకరికి గాయాలు**

**కళ్యాణదుర్గం రూరల్:** మండలంలోని పాపంపల్లి వద్ద సోమవారం ఆటో బోల్తా పడి ఒకరు గాయపడ్డారు. కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన వన్నూరుస్వామి సొంత ఆటోలో కుటుంబ సభ్యులతో కలిసి కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని ముదిగల్లుకు వస్తున్నాడు. మొహర్రం సందర్భంగా బంధువుల ఇంటికి వస్తుండగా పాపంపల్లి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వన్నూరుస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఏడుగురికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు హుటాహుటిన అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జలధికి తరలిన పీర్లు



కృష్ణాపురంలో ఊరేగుతున్న పీర్లు



విప్ కాపు రామచంద్రారెడ్డికి తులాభారం వేస్తున్న నాయకులు

**రాయదుర్గం రూరల్:** మండలంలోని వేపరాల గ్రామంలో మొహర్రం స ందర్భంగా సోమవారం జలధి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తన సతీమణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు దిలావర్ బాషా, బోర్‌వెల్ నాగిరెడ్డి, సర్పంచ్ నసీమాబేగం చక్కెర చదివించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పర నాగేంద్ర ఆధ్వర్యంలో పీర్లకు ప్రభుత్వ విప్ తూకం చక్కెరతో తులాభారం సమర్పించారు. అలాగే ఏపీఐఐసీ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మొహర్రం ఉత్సవాల్లో పాల్గొన్నారు. టి.వీరాపురం, మెచ్చెరిలో సోమవారం పెద్ద సరిగెత్తు నిర్వహించారు.

**బొమ్మనహాళ్:** మండలంలోని కొలగానహళ్లి, కృష్ణాపురం గ్రామాల్లో సోమవారం పీర్లను జలధికి తరలించారు.

**అగ్నిగుండంలో పడి యువకుడికి గాయాలు**

**బొమ్మనహాళ్:** మండలంలోని కొలగానహళ్లిలో అగ్నిగుండంలో పడి ఓ యువకుడు గాయపడ్డాడు. మొహర్రం వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఉదయం అగ్ని గుండం ఎదుట చిందులేస్తూ మారుతి అనే యువకుడు అదుపు తప్పి అగ్ని గుండంలో పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే వెలికి లాగారు. అప్పటికే తీవ్ర గాయాలైన మారుతిని కుటుంబసభ్యులు బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం అతని పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు సమాచారం.

## రాయలసీమ ద్రోహి చంద్రబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వ, పైలా నరసింహయ్య, హరీష్ యాదవ్

**బెళుగుప్ప:** టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రాయలసీమ ద్రోహి అని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని గంగవరంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నతో కలసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు 14 సంవత్సరాల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేశాడన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తాగునీటి ప్రాజెక్టుగా ఉన్న హంద్రీనీవాను సాగునీటి ప్రాజెక్టుగా తీర్చిదిద్ది 99 శాతం మొదటి దశ పనులను 70 శాతం రెండవ దశ పనులను పూర్తి చేసి కృష్ణా జలాలను రాయలసీమ వాసులకు ఇచ్చి.. ఇక్కడి రైతుల హృదయాల్లో పదిలంగా నిలిచారన్నారు. ఇదే బాటలో వైఎస్సార్ తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాయలసీమ ప్రాజెక్టుల అభివృద్ధికి కంకణబద్ధులై వున్నారన్నారు. ఇటీవలే కళ్యాణదుర్గం పర్యటనలో హంద్రీనీవా అనుబంధంగా వున్న భైరవాని తిప్ప ప్రాజెక్టుకు నీటిని తీసుకువెళ్లేందుకు అవసరమైన భూసేకరణను పూర్తి చేసి రూ.208 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ప్రాజెక్టు పూర్తయితే బెళుగుప్ప మండలంలోని గంగవరం, కోనాపురం, హనిమరెడ్డిపల్లి చెరువులకు నీరు వస్తుందన్నారు. అనంతరం పైలా మాట్లాడుతూ చంద్రబాబు ఏముఖం పెట్టుకుని జిల్లాకు వస్తాడని ప్రశ్నించారు. రాయలసీమ అభివృద్ధిని ఆయన ఏనాడూ పట్టించుకోలేదన్నారు. నీటి ప్రాజెక్టులంటేనే జలయజ్ఞంతో ప్రతి రైతు గుండెల్లో నిలిచిన అపర భగీరథుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. వైఎస్సార్ జలయజ్ఞంతో రూ. లక్ష కోట్లతో 23 ప్రాజెక్టులను పూర్తి చేశారన్నారు. రాయలసీమకు అన్యాయం చేసిన ఆయన జిల్లాకు రావడం, పైగా ప్రాజెక్టుల పరిశీలన అనడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### నిరుపేద చికిత్సకు రూ.లక్ష సాయం



డీఈఓ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

**బెళుగుప్ప:** నిరుపేద చికిత్సకు ఆర్థికసాయం అందజేసి బెళుగుప్పలోని శ్రీనివాస విద్యానికేతన్ యాజమాన్యం పెద్దమనసు చాటుకుంది. ఈ పాఠశాల విద్యార్థులు ఉప్పర దీక్షిత, ప్రవీణ్ కుమార్ తండ్రి ఉప్పర నరసింహులు గత నెలలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొద్దిరోజులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని 'ట్రస్ట్ వెల్ హాస్పిటల్'కు తరలించారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి శ్రీనివాస విద్యానికేతన్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అండగా నిలిచారు. రూ.లక్ష ఆర్థిక సాయాన్ని సోమవారం అనంతపురంలో డీఈఓ సాయిరాం చేతుల మీదుగా నరసింహులు కుమార్తె దీక్షితకు అందజేశారు. పాఠశాల నిర్వాహకులు వి.శ్రీనివాసులు, అపుస్మా జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, ట్రెజరర్ ఇక్బాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, నాగరాజు, సంజీవరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

**గుమ్మఘట్ట:** మండలంలోని కలుగోడులో మంగళవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు.

### దరఖాస్తు చేసుకోండి

**కూడేరు:** 'స్వచ్ఛ భారత్' ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా సోమవారం తెలిపారు. మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అలాగేజగనన్న కాలనీలో రూ.6 వేలతో ఇంకుడు గుంత నిర్మిస్తుందన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలనుకున్నవారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## తుంగభద్ర జలాలతో కణేకల్లు చెరువు కళకళ



**కణేకల్లు:** హెచ్చెల్సీకి మినీ రిజర్వాయర్‌గా ఉన్న కణేకల్లు చెరువు తుంగభద్ర జలాలతో కళకళాడుతోంది. ఆదివారం రాత్రి తుంగభద్రజలాలు కణేకల్లు చెరువులో ప్రవేశించాయి. చెరువులో కనిష్ఠ స్థాయిలో నీరు నిల్వ ఉంచి మిగిలిన నీటిని హెచ్చెల్సీ అధికారులు దిగువన విడుదల చేశారు. ఆంధ్ర, కర్ణాటకకు కలిపి తుంగభద్ర బోర్డు అధికారులు డ్యామ్ హెడ్‌లో 1500 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం తుంగభద్ర బోర్డు అధికారులు ట్రయల్ కోసం తక్కువ నీటిని వదులుతున్నారు. కాలువ పరిస్థితిని బట్టి నీటి మట్టాన్ని పెంచే అవకాశముందని హెచ్చెల్సీ అధికారులు తెలిపారు. మూడు నెలల నుంచి నీరు లేక బోసిపోయిన కణేకల్లు చెరువుకు తుంగభద్ర జలాలు చేరి కళకళాడుతుండటంతో స్థానికులు చెరువు వద్దకొచ్చి ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరి వెళ్తున్నారు.

## గ్రామాల్లో పర్యటించిన సెంట్రల్ టీం

**కూడేరు:** మండలంలోని చోళసముద్రం, ఇప్పేరు పంచాయతీల్లో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ పథకంపై పరిశీలనలో భాగంగా సెంట్రల్ టీం అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, అంగన్‌వాడీ కేంద్రాలు, చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్వాహణను పరిశీలించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు టాయిలెట్స్ వినియోగించు కుంటున్నారా లేదా ఆరా తీశారు. చెత్తతో తయారీ సంపద కేంద్రాల్లో వర్మి కంపోస్టు ఎరువును ఏ మేరకు తయారు చేశారు. తద్వారా ఆదాయం ఎంత వరకు వచ్చిందని పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటనారాయణ, పావని, సర్పంచులు ఓబులేసు, రమాదేవి, ఉప సర్పంచ్ రాజప్ప, ఎంపీటీసీ సభ్యులు నాగభూషణ, రమేష్, ఎంఎల్‌హెచ్‌పీ మీనా, వైఎస్సార్‌సీపీ నేత గంగాధర్, వలంటీర్లు పాల్గొన్నారు.

### మణిపూర్ ఘటనలు మాయనిమచ్చ

**రాయదుర్గంటౌన్:** మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసి మహిళలపై అత్యాచారం, మారణ హోమ ఘటనలు మానవతకు మాయనిమచ్చ అని పలువురు ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎంజేఎస్, ఆర్‌సీపీ, ఏపీ సంచార జాతి సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ మణిపూర్ ఘటనలకు పూర్తి బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణం రాజీనామా చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై పూర్తిగా స్పందించకపోవడం మోదీ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాదిగ మహాజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధ్యాహ్నప్ప, ఆర్‌సీపీ డివిజన్ కార్యదర్శి ఆంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మతిస్థిమితం లేని బాలుడి మృతి

**గుమ్మఘట్ట:** మండలంలోని కలుగోడులో మతిస్థిమితం లేని బాలుడు తిరుమలేష్ (14) సోమవారం మృతిచెందాడు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని గోవిందయ్యదొడ్డి గ్రామానికి చెందిన మంజునాథ, మీనమ్మ, కుమారుడు తిరుమలే కలుగోడు గ్రామానికి పీర్ల పండుగకు వచ్చారు. తిరుమలేష్‌కు అప్పడప్పుడు ఫిట్స్ వస్తువుండేవి.పైగా మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంచేవారు పీర్లస్వాములను చూసేందుకు ఆదివారం సాయంత్రం వెళ్లిన తిరుమలేష్ రాత్రి ఇంటికి రాలేదు. గ్రామంలో ఎంత గాలించినా ఆచూకి కనిపించలేదు. సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు విషయాన్ని బంధువులకు తెలిపారు. కుటుంబసభ్యులు మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించారు.

## 'కాపు'తోనే అభివృద్ధి సాధ్యం

**గుమ్మఘట్ట:** రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రా రెడ్డితోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు మహేష్, ఎంపీపీ భవాని అన్నారు. మండలంలోని కలుగోడు గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నేత్రపల్లి నుంచి బేలోడు, రంగచేడు గ్రామాల మీదుగా కలుగోడు వరకూ రూ.4.11తో బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. అలాగే భూపసముద్రం నుంచి బీఎన్.హళ్లి మీదుగా గొల్లపల్లి వరకు రూ.26 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మాణాలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ మాట్లాడి నిధులు మంజూరు చేయించారని వారు తెలిపారు. సెల్ఫీలతో డబ్బా కొట్టుకుంటున్న కాలవ శ్రీనివాసులుకు అభివృద్ధి ఎక్కడ జరిగిందో మా వెంట వస్తే చూపిస్తామన్నారు. మీ హయాంలో నియోజకవర్గంలో ఎంతమేర రోడ్లు వేశారో, విప్ హయాంలో ఎంతమేర రోడ్లు వేశారో లెక్కలతో రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఓబుళకాంతమ్మ, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, నాయకులు హనుమంతరెడ్డి, గోవిందరెడ్డి, అంజినయ్య, నాగేంద్రప్ప, గోవిందప్ప, వెంకటేశులు, శివ, వీరారెడ్డి, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.